ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రంగారెడ్డి
5 జిల్లా వార్తలు
మంగళవారం 27 ఆగస్టు 2024

అంబరాన్నంటేన సంబరం

» కడ్తాలలో వైభవంగా పోచమ్మ బోనాలు » ఆకట్టుకున్న కళాకారుల నృత్య ప్రదర్శన



నృత్యం చేస్తున్న కళాకారులు, పెద్ద సంఖ్యలో హాజరైన ప్రజలు

కడ్తాల మండల కేంద్రంలో సోమవారం బోనాల సంబరం అంబరాన్నంటింది. పోచమ్మ బోనాల నేపథ్యంలో ఆలయాన్ని పచ్చటి తోరణాలు, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. ఉత్సవ కమిటీ చైర్మన్ ఏ.సత్యం యాదవ్, సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా ఏర్పాట్లు చేశారు. సాయంత్రం మహిళలు బోనాలను అందంగా అలంకరించుకుని ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని అమ్మవారికి నైవేద్యం సమర్పించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ర్యాలీలో అమ్మవారి వేషధారణ, ఫలహార బండి, శివసత్తుల ఘటం, పోతరాజుల విన్యాసాలు, మహిళల పూనకాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. రాజమండ్రి, గుంటూరు, విజయవాడ నుంచి వచ్చిన కళాకారులు నిర్వహించిన కాంతార ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. బోనాలను తిలకించేందుకు ప్రజలు భారీగా తరలిరావడంతో రోడ్లు జన సంద్రంగా మారాయి. కార్యక్రమంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్, జర్పుల దశరథ్‌నాయక్, ఆనంద్, గూడూరు శ్రీనివాస్ రెడ్డి, వేణుగోపాల్, లక్ష్మీనర్సింహారెడ్డి, యాట నర్సింహ, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

కడ్తాల, ఆగస్టు 26



నృత్యం చేస్తున్న శివసత్తులు



ఆకట్టుకున్న కాంతార ప్రదర్శన



బోనాలతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు

అప్పుల పాలు!

బిల్లులు అందక పాడిరైతు పరేషాన్



జిల్లాలో పాడి రైతులు సమస్యల సుడిగుండంలో కొట్టుమిట్టాడుతున్నారు. రూ.లక్షల పెట్టుబడి పెట్టి ఉత్పత్తి చేసిన పాలకు గిట్టుబాటు ధర లేక ఇబ్బంది పడుతుంటే పాల బిల్లులు సైతం సకాలంలో అందక నానా అవస్థలు పడుతున్నారు. పాల ఉత్పత్తి సంఘాలుగా ఏర్పడి బ్యాంకుల్లో, మహిళా సంఘాల్లో, వ్యాపారుల వద్ద అప్పులు చేసి పశువులను కొనుగోలు చేసి విజయ డెయిరీకి పాలు పోస్తున్నారు. బిల్లులు రాక పోవడంతో కిస్తీలు కట్టలేక ఆందోళన చెందుతున్నారు. దీంతో చేసేదేమీ లేక అప్పులు తెచ్చి పెట్టుబడి పెడుతున్నారు. అలాగే రైతులకు లీటరు పాలకు రూ.4 చొప్పున ప్రభుత్వం ఇస్తున్న అదనపు ప్రోత్సాహకమూ అందడం లేదు. బ్యాంకర్ల నుంచి రుణ సౌకర్యం కూడా కరువైందని పాడి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

» జిల్లాలో రూ.21 కోట్ల బిల్లులు పెండింగ్ » పాడి రైతులకు ప్రోత్సాహం కరువు
» పాలకు అందని రూ.4 ఇన్సెంటివ్
» నాలుగేళ్లుగా తప్పని ఎదురుచూపులు
» మోయలేని భారంతో పశువుల అమ్మకం
» ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్): జిల్లాలో పాడి రైతులకు ప్రోత్సాహం కరువైంది. ప్రభుత్వం నుంచి ఆదరణ కరువై ఆందోళన చెందుతున్నారు. ఆర్థిక చేయూతను అందించేందుకు గత ప్రభుత్వం ప్రత్యేకంగా రాయితీలు, ప్రోత్సాహకాలు ప్రవేశపెట్టినా, వాటికి నిధులు సకాలంలో విడుదల కాక ప్రయోజనం లేకుండా పోయింది. ఫలితంగా వ్యవసాయ అనుబంధమైన పాడి రైతులు నష్టాల పాలవుతున్నారు. మరోవైపు పెరుగుతున్న ధరలతో పశుపోషణ మోయలేని భారంగా మారింది. అలాగే పాలకు కనీస ధరల వ్యవస్థ లేకపోవడం రైతులకు కంటగింపుగా మారింది. ప్రమాద వశాత్తు గేదె మృతి చెందితే బీమా సౌకర్యానికి సైతం నోచుకోవడం లేదు. పశువులకు దాణా, మిండ్రాల్ మిక్చర్, కాల్షియం, మందులు, కూలీలకు వేతనాలు తదితరాలకు డబ్బులు లేక ఆందోళన చెందుతున్నారు.

జిల్లాలో పాల సేకరణ, నిల్వ సామర్థ్యం వివరాలు			
పాల శీతలీకరణ కేంద్రాలు	నిల్వ సామర్థ్యం (లీ.వేలలో)	పాల సేకరణ కేంద్రాలు	పాల సేకరణ (లీటర్లు)
కడ్తాల్	40	51	27,253
షాద్‌నగర్	32	65	14,660
చల్లంపల్లి	5	18	8,250
చందన ధన	5	17	6,450
మాడ్గుల	5	27	7,420
మన్నేగూడ	1	02	450
జైతవరం	1	02	2,445
కొందుర్గు	8	47	8,180
కేశంపేట	5	10	4,120
ఎక్లాస్‌ఖాన్‌పేట్	3	07	1,920
పిట్టలగూడ	1	04	2,450
షాబాద్	5	13	2,930
వికారాబాద్	10	29	5,140
పాలమూకుల	10	17	6300

పదిహేను రోజులకోసారి బిల్లులు

జిల్లాలో 14 పాల శీతలీకరణ కేంద్రాలు ఉన్నాయి. అందులో ఒక పాల శీతల కేంద్రంతో పాటు ఓ డెయిరీ, 12 చిన్న తరహా శీతలీకరణ కేంద్రాలు ఉన్నాయి. రాష్ట్ర పాడి పరిశ్రమాభివృద్ధి సహకార సమాఖ్య ద్వారా జిల్లా పరిధిలోని 309 పాల సేకరణ కేంద్రాల ద్వారా రోజుకు 97,998 లీటర్ల పాలను సేకరిస్తున్నారు. అలాగే మొత్తం 13,100 లీటర్ల పాల నిల్వ సామర్థ్యం ఉండగా ప్రస్తుతం 97,998 లీటర్ల పాలను సేకరిస్తున్నారు. రైతులకు వెన్న శాతాన్ని బట్టి ధర నిర్ణయిస్తారు. 15 రోజులకోసారి రైతులకు బిల్లులు రైతుల వారీగా బ్యాంకు ఖాతాల్లో జమ చేయాల్సి ఉండగా.. 47 రోజులకు సంబంధించిన బిల్లులు ఇప్పటి వరకు చెల్లించలేదు. కొన్ని చోట్ల పాలు కేంద్రం నిర్వాహకుడు చేతి నుంచి రైతులకు డబ్బులు చెల్లిస్తున్నాడు. మిగతా చోట్ల రైతులు పాల బిల్లుల కోసం నిరీక్షిస్తున్నారు.

తప్పని ఎదురుచూపులు

రైతులు పాడి పోషణపై దృష్టి సారించాలనే ఉద్దేశంలో గత ప్రభుత్వం పాల ధరలను పెంచింది. సహకార సంస్థల్లో పాలను విక్రయించి రైతులకు లీటరు పాలకు రూ. 4 చొప్పున నగదు ప్రోత్సాహాన్ని ప్రకటించింది. దీంతో పలువురు రైతులు, నిరుద్యోగ యువత పాడి పరిశ్రమపై దృష్టి సారించి పాడి ఆవులు, గేదెలను పోషిస్తూ ఉపాధి పొందుతున్నారు. అదనంగా చెల్లిస్తామని చెప్పిన ప్రోత్సాహక నగదు 2020 ఏప్రిల్ నుంచి ప్రభుత్వం చెల్లించడం లేదు. పాడి పరిశ్రమతో జీవనోపాధి పొందుదామని ఆశించిన వారంతా సకాలంలో ప్రోత్సాహకం అందక నిరాశలో ఉన్నారు.

పెరిగిన దాణా భారం

పశుగ్రాసం, దాణా ధరలు పెరిగిపోవడంతో అప్పు చేసి పాడిని కొనసాగిస్తున్నారు. క్వింటాలు దాణా రూ.3 వేలపైనే ఉంది. ట్రాక్టర్ గడ్డి రూ.15 వేలకు పైగానే ఉంది. అలాగే లారీ గడ్డికి రూ.30 వేలు వెచ్చించాల్సి వస్తోంది. పాల ఉత్పత్తి కంటే పాడి పశువులను బతికించుకోవాల్సిన పరిస్థితి నెలకొందని పాడి రైతులు వాపోతున్నారు. ఇన్సెంటివ్‌ను వెంటనే తమ ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

అవగాహన కరువు

సొసైటీల్లో సభ్యులైన పాడి రైతుల కుటుంబాల్లో ఆడ పిల్లల వివాహమైతే కానుకగా రూ.5 వేలు, రైతు మృతి చెందితే దహన సంస్కారాలకు రూ.5 వేలు అందజేస్తారు. గేదెల పంపిణీ, రాయితీలో దాణా, గడ్డి విత్తనాలు, మినరల్ మిక్చర్, కాల్షియం పంపిణీ చేస్తున్నా.. వీటిపై అవగాహన లేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.



వీరన్నపేట కేంద్రంలో పాలు పోస్తున్న రైతు

భారమైన పశుపోషణ



ఖర్చులు పెరిగి పోయాయి. పశుపోషణ భారంగా మారింది. ఒక గేదెకు నెలకు రెండు సంచుల దాణా అవసరమవుతుంది. ఒక సంచి దాణా రూ.1,200 ఖర్చు పెట్టాల్సి వస్తోంది. డెయిరీ నుంచి సబ్సిడీపై అందాల్సిన దాణా అందడం లేదు. అలాగే సకాలంలో పాల బిల్లులు అందక పోవడంతో కూలీ డబ్బులతో దాణా కొంటున్నాం.

-రామాంజనేయులు, పాడిరైతు, వీరన్నపేట

రూ. 2.35 కోట్ల బిల్లులు పెండింగ్



కొందర్గు బీఎంసీయూ పాల కేంద్రంలో 70 రోజులకు సంబంధించిన పాల బిల్లులు రూ.2.35 కోట్లు రావాల్సి ఉంది. బిల్లులు చెల్లించడంలో తీవ్ర ఆలస్యం జరుగుతోంది. ప్రభుత్వం వెంటనే స్పందించాలి. పెండింగ్ పాల బిల్లులను ఇచ్చేలా చర్యలు తీసుకోవాలి. పాల రైతులను ఆదుకోవాలి.

-విఠల్ నాయక్, చింతకుట తాండ, జిల్లేడు చౌదరిగూడెం మండలం

పాడి రైతులను ఆదుకోవాలి



షాబాద్ మండలంలో 13 పాల కేంద్రాలు ఉన్నాయి. సుమారు 300 మంది రైతులు విజయ డెయిరీకి పాలు పోస్తున్నారు. అందరికి కలిపి సుమారు రూ.30 లక్షల వరకు పాల బిల్లులు పెండింగ్‌లో ఉంటాయి. బయట వడ్డీకి తీసుకొచ్చి రైతులకు చెల్లిస్తున్నాను. ప్రభుత్వం స్పందించి పెండింగ్ బిల్లులు త్వరగా ఇప్పించాలి. పాడి రైతులను ఆదుకోవాలి.

-నాగరాజు, షాబాద్ మండల పాల కేంద్రం నిర్వాహకుడు

అప్పులు చేసి బిల్లులు చెల్లిస్తున్నాం



అప్పులు చేసి పాడి రైతులకు బిల్లులు చెల్లిస్తున్నాం. పాడి పరిశ్రమ అభివృద్ధి సహకార సంస్థ సకాలంలో బిల్లులు చెల్లించడం లేదు. దీంతో రైతులకు చేతి నుంచి డబ్బులు చెల్లించాల్సి వస్తుంది. విజయ డెయిరీకి రైతులు పాలు పోస్తున్నా ప్రభుత్వం నుంచి సరైన ప్రోత్సాహం అందడం లేదు. ఏళ్ల తరబడి లీటరుకు రూ.4కోసం ఎదురుచూస్తున్నారు.

-రామచంద్రయ్య, విజయ డెయిరీ కేంద్రం నిర్వాహకుడు, లచ్చంపేట

గోపాల.. గోపాల..

ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు



శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను జిల్లా వ్యాప్తంగా సోమవారం వైభవంగా జరుపుకున్నారు. వేణుగోపాల స్వామి ఆలయాల్లో కృష్ణుడికి ఉయ్యాలసేవ, పంచామృతాభిషేకం, భజన కార్యక్రమాలు నిర్వహించారు. వాడవాడల్లో ఉట్లు కొట్టారు. పలు పాఠశాలల్లో వివిధ సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించగా, చిన్నారులు రాధాకృష్ణుడి వేషధారణల్లో నృత్యాలు చేస్తూ, కోలాటాలు ఆడుతూ ఆకట్టుకున్నారు. అలాగే ఇళ్లలో తమ పిల్లలను గోపిక, కృష్ణుడి వేషధారణల్లో ముస్తాబు చేసి తల్లిదండ్రులు ఆనందించారు.



ఇబ్రహీంపట్నం త్రిశక్తి ఆలయంలో కృష్ణాష్టమి వేడుకలు

వినాయక చవితిని శాంతియుతంగా జరుపుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీసీపీ రాజేశ్

శంషాబాద్/శంషాబాద్ రూరల్, ఆగస్టు 26: వినాయక చవితిని శాంతియుతంగా జరుపుకోవాలని శంషాబాద్ డీసీపీ రాజేశ్ సూచించారు. శంషాబాద్ మండలంలోని పెద్దషాపూర్ ఎస్వీరెడ్డి ఫంక్షన్ హాల్‌లో సోమవారం శంషాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని వినాయక మండపాల నిర్వాహకులు - గ్రామపెద్దలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి డీసీపీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయక మండపాల నిర్వహణ, విగ్రహాల ప్రతిష్ఠాపన, నిమజ్జనానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఎక్కడైనా సమస్య ఉంటే, లేదా ఎవరైనా అపరిచితులు అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. అనంతరం ఏసీపీ కేఎ్ సరావు, సీఐ నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ నిర్వాహకులు ఎప్పటికప్పుడు పోలీసులకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమానికి ఆయా గ్రామాలకు చెందిన పెద్దలు స్థానిక నాయకులు హాజరయ్యారు.

కలుషిత నీటితో చేపల మృత్యువాత



చెరువులో మృతి చెందిన చేపలు

షాద్‌నగర్ రూరల్, ఆగస్టు 26: షాద్‌నగర్ పరిధి చటాన్‌పల్లి సురసముద్రం చెరువులో కలుషిత నీటితో సోమవారం వందల సంఖ్యలో చేపలు మృత్యువాత పడ్డాయి. చాక్లెట్ పరిశ్రమ నుంచి వెలువడిన కలుషిత నీరు చెరువులో చేరడంతోనే చేపలు మృత్యువాత పడ్డాయని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేశారు. రూ.4లక్షల విలువైన చేప పిల్లలను వదిలామని, తమకు రూ.20లక్షల నష్టం జరిగిందన్నారు. దీంతో మత్స్యకారులు ఆ పరిశ్రమ వద్ద ఆందోళన వ్యక్తం చేశారు. యాజమాన్యం స్పందించి నష్టపరిహారం చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం వారు కంపెనీ ప్రతినిధులకు వినతిపత్రం అందజేశారు. యాజమాన్యంతో మాట్లాడి న్యాయం చేస్తామని ప్రతినిధులు తెలపడంతో ఆందోళన విరమించారు.

చిరుధాన్యాలతో మెరుగైన ఆరోగ్యం

» అవగాహన సదస్సులో పద్మశ్రీ పురస్కార గ్రహీత డాక్టర్ ఖాదర్ వలీ



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న పద్మశ్రీ పురస్కార గ్రహీత డాక్టర్ ఖాదర్ వలీ

శంషాబాద్ రూరల్, ఆగస్టు 26: చిరు ధాన్యాలను నిత్యం తీసుకునే ఆహారంలో భాగం చేసుకుంటే ఆరోగ్యం సొంతం చేసుకోవచ్చునని పద్మశ్రీ పురస్కార గ్రహీత, శాస్త్రవేత్త డాక్టర్ ఖాదర్ వలీ సూచించారు. మూడు రోజులుగా హైదరాబాద్ ముచ్చింతల్‌లోని స్వర్ణభారత్ ట్రస్టులో రైతు నేస్తం ఫౌండేషన్ స్వర్ణభారత్ ట్రస్టు సహకారంతో కర్షక సేవా కేంద్రం నిర్వహణలో జరుగుతున్న 'సిరి ధాన్యాలతో జీవన సిరి' అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో స్వర్ణభారత్ ట్రస్టు ముఖ్య కార్య నిర్వహణ అధికారి డీవీఎన్ రావు, రైతు నేస్తం ఫౌండేషన్ చైర్మన్ యడ్లపల్లి వెంకటేశ్వరరావు, డాక్టర్ సరళా ఖాదర్ పాల్గొన్నారు. 150 ఏళ్ల క్రిదం మధుమేహం అంటే ఎవరికి తెలియదని, కానీ నేడు దేశ వ్యాప్తంగా ప్రతీ వంద మందిలో 20-25 మంది మధుమేహంతో బాధపడుతున్నారని అన్నారు. అదే విధంగా పుట్టే ప్రతీ వంద మంది పిల్లల్లో 10 నుంచి 15 మంది బుద్ధిమాంద్యంతో పుడుతున్నారని వివరించారు. ఈ సమస్యలన్నింటికి పోషకాలు లేని ఆహారం తీసుకోవడమే ప్రధాన కారణం అన్నారు. సంపూర్ణ ఆరోగ్యం కోసం కొర్రలు, అండ్రు కొర్రలు, అరికలు, సామలు, ఉదలతో పాటు కషాయాలను ఆహారంగా తీసుకుంటే ఆరు నెలల్లో ఆరోగ్యం మెరుగుపడుతుందని వివరించారు. పాలు, టీ, కాఫీ, ప్లాస్టిక్ కవర్‌లలో శుద్ధి చేసిన ఆహారాలను మానేయాలని సూచించారు. మధుమేహం, బీపీ, థైరాయిడ్ లాంటి రోగాలను నయం చేసే శక్తి ఈ ఐదు సిరి ధాన్యాలకు, కషాయాలకు ఉందని తెలిపారు.

పోలీస్ స్టేషన్‌కు తరలిస్తుండగా వ్యక్తి మృతి

ఆదిభట్ల, ఆగస్టు 26: పోలీస్‌స్టేషన్‌కు తీసుకువస్తుండగా ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఈ ఘటన ఆదిభట్ల పరిధిలో సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. ఆదిభట్ల పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాలాపూర్ నాదర్‌గుల్‌లో ముగ్గురు ఆటోలో అనుమానాస్పదంగా సంచరిస్తున్నారని పోలీసులకు సమాచారం అందింది. దీంతో అక్కడికి వెళ్లిన పోలీసులకు బాబానగర్‌కు చెందిన మహ్మద్ హాజీ(43), నల్గొండ జిల్లా దేవరకొండ మండలం ముదిగొండకు చెందిన రత్లావత్ గోవింద్, అదే మండలం మర్రిచెట్టు తండాకు చెందిన ఆటోడ్రైవర్ నెనావత్ నరేశ్ కనిపించారు. వారిని ఆటోలో పోలీస్‌స్టేషన్‌కు తీసుకువస్తుండగా మహ్మద్ హాజీ గుండెనొప్పిగా ఉందని తెలిపాడు. అతడిని ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు డాక్టర్లు నిర్ధారించారని పోలీసులు తెలిపారు. హాజీకి 20 రోజుల క్రితం ఓపెన్ హార్ట్ సర్జరీ అయ్యిందని, అతడు బాలాపూర్‌లోని దర్గాను దర్శించుకొని వస్తుండగా పోలీసులు పట్టుకొని తీవ్రంగా కొట్టడం వల్లే మృతిచెంది ఉండొచ్చని హాజీ సోదరుడి కుమారుడు మహ్మద్ ఫయిస్ అనుమానం వ్యక్తం చేశారు.

బాస్కెట్‌బాల్ చాంపియన్ మేడ్చల్ జట్టు

మూడో స్థానంలో నిలిచిన రంగారెడ్డి బాలికల టీం



జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఐదో రాష్ట్రస్థాయి అండర్-16 బాల, బాలికల బాస్కెట్ బాల్ టోర్నీ ముగిసింది. మహబూబ్‌నగర్‌లో బాలుర విభాగంలో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో హైదరాబాద్ జట్టు వికారాబాద్‌పై గెలిచి విజేతగా నిలువగా, బాలికల విభాగంలో మేడ్చల్ జట్టు వికారాబాద్‌పై గెలిచి చాంపియన్‌గా నిలిచింది.

7



జానపద కళాప్రదర్శనకు కళాకారులు సిద్ధమవ్వాలి

కొడంగల్ రూరల్, ఆగస్టు 26: ఈనెల 29న కోస్గి పట్టణంలోని ఏబీకే ఫంక్షన్‌హాల్‌లో జానపద కళాప్రదర్శనకు సిద్ధమవ్వాలని జానపద కళాకారుల సంఘం జిల్లా కార్యదర్శి ఎం.కృష్ణయ్య కళాకారులకు పిలుపునిచ్చారు. కొడంగల్ పట్టణంలోని ఆర్ అండ్ బీ అతిథి గృహంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గ స్థాయిలో ఉన్న జానపద కళాకారులు ప్రదర్శనకు సిద్ధమవ్వాలని జానపద కళారూపాలైన డప్పు, డోలు, బంజారా, బుడగజంగం, తోలుబొమ్మలు, యక్షగానం, వీధినాటకం, అడుగుల భజన, కోలాటం, నృత్యం, జడకొప్పు, భైండ్ల, బాలసంతు, సన్నాయి, కొమ్ము, దుమ్మనకొయ్య, వంటి తదితర కళాకారులు తమ ప్రదర్శనను వేదికపై ప్రదర్శించి తమ ప్రతిభను నిరుపించుకోవాలని కోరారు. ప్రదర్శనలో పాల్గొన్న వారికి ప్రశంసాపత్రం, జ్ఞాపికలు అందజేసి సత్కరించనున్నట్లు తెలిపారు. ఆసక్తిగలవారు 9848265026, 7702215878 ఫోన్ నంబర్లను సంప్రదించాలన్నారు. ఈ సందర్భంగా శకనప్ప, పరమేశ్వర్, బుడగ జంగం నర్సింహులు, అంబేద్కర్ యువజన సంఘం నియోజకవర్గం అధ్యక్షుడు యు.రమేష్ బాబు, డీవీఎంసీ మెంబర్ దస్తప్ప పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జానపద కళాకారుల సంఘం జిల్లా కార్యదర్శి కృష్ణయ్య

పాత బావికి ప్రాణం

- పూడికతీతతో పుష్కలంగా నీరు
- నాట్లు వేసేందుకు పొలం సిద్ధం


వ్యవసాయ బావికి బిగించిన క్రేన్, పాత బావిలో పూడిక తీస్తున్న కూలీలు

యాచారం, ఆగస్టు 26: అడపాదడపా కురుస్తున్న వర్షాలతో భూగర్భ జలమట్టం పైకొచ్చి పాత బావుల్లో నీరు ఊరుతోంది. ఎండల్లో వందల ఫీట్ల బోరు వేసినా నీరు పడడం లేదు. అలాంటిది ఇప్పుడు కొన్ని పాత బావుల్లో నీరు ఊరుతోంది. అయితే చాలా బావులు ఇప్పుడు వినియోగంలో లేవు. వాటిల్లో పూడిక పేరుకుంది. రైతులు ఎక్కువగా బోర్లపైనే ఆధారపడ్డారు. అయితే చౌదర్‌పల్లిలో నాయిని రాంరెడ్డి పొలంలో పాత వ్యవసాయ బావి ఉంది. దానిలో పూడిక పేరుకుంది. దానిలో పూడిక తీస్తే పొలానికి సరిపడా నీరందుతుందని రైతు మల్కీజ్‌గూడ నుంచి క్రేన్ తెప్పించి పూడిక తీస్తున్నాడు. ఐదారు గజాల మందం పూడిక తీస్తే ఈ వానకాలంలో వరి పొలానికి సరిపడా నీరందుతుందని రైతు చెప్పాడు. ఇప్పటికే మూడు గజాల మేర పూడిక తీసినట్టు రైతు చెప్పాడు. మరో నాలుగైదు గజాల మేర పూడిక తీస్తానని రైతు తెలిపాడు.

చింతకాయలు కిలో రూ.200




కొడంగల్ రూరల్, ఆగస్టు 26: మార్కెట్‌లో చింతకాయలకు గిరాకీ పెరిగింది. గోకులాష్టమిని పురస్కరించుకుని సోమవారం ప్రతీఒక్కరు తమఇళ్లలో వండే వంటకాల్లో చింతకాయలను ఉపయోగించాలని తరతరాలుగా వస్తున్న ఆచారం. దీంతో ప్రతీ ఒక్కరు చింతకాయలను కొనుగోలు చేసేందుకు మార్కెట్‌కు తరలివచ్చారు. దీంతో చింతకాయల ధరను వ్యాపారులు ఒక్కసారిగా పెంచి సొమ్ముచేసుకున్నారు. కిలో చింతకాయల ధర రూ.200లకు విక్రయించారు. టమాట, వంకాయ, బీరకాయ, చిక్కుడుకాయ, బెండకాయ తదితర కూరగాయల ధర కిలో రూ.40లకు విక్రయించారు. చింతకాయల ధరలు అమాంతం పెరగడంతో చింతకు భలే ధర ఉందని వినియోగదారులు చర్చించుకున్నారు.

చట్టాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలి


శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్

ఆమనగల్లు, ఆగస్టు 26 : చట్టాలు, న్యాయవ్యవస్థపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని తెలంగాణ హైకోర్టు ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు జె.శ్రీనివాస్ అన్నారు. బ్రిటీషర్ల నాటి చట్టాలకు తెరపడిందన్నారు. భారత న్యాయ వ్యవస్థలో మూడు కొత్త నేరచట్టాలైన భారతీయ న్యాయ సంహిత, నాగరిక్ సురక్ష సంహిత, సాక్ష్య అధినియమ్ అమల్లోకి వచ్చాయన్నారు. ఆమనగల్లు మండలం అయ్యసాగర్ త్రిపురాంతకేశ్వర వీరభద్రస్వామి, మైసిగండి మైసమ్మ ఆలయాలను సోమవారం శ్రీనివాస్ సందర్శించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నూతనంగా చేసిన మూడు చట్టాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ పోలీసులు చర్యలు చేపట్టాలని సూచించారు. వాహనదారులు, ప్రయాణికులు విధిగా ట్రాఫిక్‌రూల్స్ పాటించాలని కోరారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్, బాచిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.



















ఘట్‌కేసర్ వద్ద ఎరిమల్లెవాగులో పారుతున్న జవహర్‌నగర్ విషరసాయనాలు

పచ్చని చెట్ల మధ్య కలుషితనీరు

ఘట్‌కేసర్, ఆగస్టు 16: ఇరువైపులా అందమైన పచ్చని చెట్ల నడుమ ప్రవహిస్తున్న వాగు ఇది. అందులో అత్యంత ప్రమాదకరమైన హాలాహలం ప్రవహిస్తోంది. నాడు స్వచ్ఛమైన వర్షపునీటితో గలగల పారే ఎరిమల్లెవాగు నేడు పూర్తిగా కలుషితమై జవహర్‌నగర్ డంపింగ్ యార్డు వ్యర్థ రసాయన జలాలతో పారుతోన్నది. పరిసరాల్లోకి వెళ్లాలంటే ముక్కు మూసుకొని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొన్నది. జవహర్‌నగర్ నుంచి వచ్చే ఈవాగు అనేక గ్రామాలను దాటుకొని ఘట్‌కేసర్ మీదుగా ఎదులాబాద్ లక్ష్మీనారాయణ చెరువులో కలుస్తుంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి జలాలు కలుషితం కాకుండా తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా ఇమామె ఖాసీం బాబా దర్గా ఉర్సు



ప్రార్థనలు చేస్తున్న ముస్లిం పెద్దలు, ఇమామె ఖాసీం బాబా దర్గా

మేడ్చల్ టౌన్, ఆగస్టు 26: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఇమామె ఖాసీంబాబా దర్గా ఉర్సు ఉత్సవాలు ఆదివారం రాత్రి స్థానిక ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. కులమతాలకు అతీతంగా నిర్వహించే ఉర్సు వేడుకల్లో స్థానికులు పెద్దఎత్తున పాల్గొని దర్గాలో దట్టీలు సమర్పించుకుని మొక్కును తీర్చుకున్నారు. ఈ సందర్భంగా దర్గాలో షేక్ అక్బర్ పీర్‌బాబా వారి ఆధ్వర్యంలో పెద్దఎత్తున ప్రార్థనలు నిర్వహించారు. వేడుకల్లో పాల్గొనడానికి విచ్చేసిన భక్తుల సౌకర్యార్థం నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. దర్గాను దర్శించుకోవడానికి స్థానికులే కాకుండా నగరంలోని మారుమూల ప్రాంతాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. భక్తుల కోసం అన్నదానం చేశారు. స్థానిక ప్రజాప్రతినిధులు ఉర్సు వేడుకల్లో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేసి దట్టీలు సమర్పించుకున్నారు.

రైల్వే గేటు కష్టాలు తీరేదెన్నడో?



బషీరాబాద్‌లో రైల్వేగేటు వేయడంతో నిలిచిన వాహనాలు

బషీరాబాద్, ఆగస్టు 26: బషీరాబాద్‌లోని రైల్వేగేటు వద్ద తరుచూ గేటు పడటంతో వాహనదారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇక్కడ ప్రభుత్వ కార్యాలయాలు, దుకాణాలన్నీ గేటు దాటి రావాల్సి ఉండటంతో నిత్యం ప్రజలు, ఉద్యోగులు రాకపోకలు సాగిస్తుంటారు. రైలువచ్చిన ప్రతీసారి గేటు వేయడంతో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోతున్నాయి. రైలు వెళ్లగానే గేట్ తెరిచినప్పుడు ఒకేసారి ఎదురెదురుగా వాహనాలు వస్తుండటంతో ఒక్కోసారి ట్రాఫిక్ జాం కావడంతో ముందుకెళ్లే పరిస్థితి ఉండదని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా రైల్వేగేటు కష్టాలు తీర్చాలని మండలవాసులు కోరుతున్నారు.

ఫిరంగి కాలువను పరిరక్షించాలి



మాట్లాడుతున్న బక్కని నర్సింహులు

షాద్‌నగర్ అర్బన్, ఆగస్టు 26: గొలుసు కట్టు చెరువులను నింపేందుకు స్వాతంత్ర్యానికి పూర్వం ఏర్పాటు చేసిన ఫిరంగి కాలువను పరిరక్షించాలని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు బక్కని నర్సింహులు కోరారు. సోమవారం ఆయన మాట్లాడారు. మంత్రి శ్రీధర్ బాబు, చేవెళ్ల, షాద్‌నగర్, రాజేంద్రనగర్, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యేలకు లేఖలు రాశారు. చేవెళ్ల పరిధి చందనవెళ్లి నుంచి 1872లో ఫ్రెంచ్, పర్షియా ఇంజినీర్ల నైపుణ్యంతో ఫిరంగి కాలువను తవ్వారని తెలిపారు. చందనవెళ్లి కత్వ నుంచి పాల్మాకుల నందుల కత్వకు నీరు చేరేదన్నారు. నందుల కత్వ నుంచి శంషాబాద్ చెరువుకు, అక్కడి నుంచి మహేశ్వరం మీదుగా ఇబ్రహీంపట్నం పెద్దచెరువుకు నీరు వెళ్లేదన్నారు. పాల్మాకుల నందుల కత్వ నుంచి షాద్‌నగర్‌కు తాగునీరు వచ్చినట్టు చారిత్రక ఆధారాలు ఉన్నాయన్నారు. 28గ్రామాలకు, 100వరకు కుంటలు, చెరువులకు వరదాయినిగా ఉన్న ఫిరంగి కాలువ మరమ్మతులకు ఉమ్మడి ఏపీలో రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా ఉన్న శ్రీధర్‌బాబు నిధులు మంజూరు చేసినా కార్యరూపం దాల్చలేదన్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారం పెరిగిన తరువాత ఫిరంగి కాలువ ఆక్రమణలకు గురైందన్నారు. ఫిరంగి కాలువపై విచారణ చేసి, కాలువను పునరుద్ధరించాలని ఈ సందర్భంగా నర్సింహులు కోరారు.

తొండిపల్లిలో ట్రాఫిక్ సమస్య పరిష్కరించండి



ఎంపీ విశ్వేశ్వరరెడ్డికి వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

శంషాబాద్, ఆగస్టు 26: శంషాబాద్ మున్సిపాలిటీ పరిధి తొండిపల్లిలో 44వ హైదరాబాద్-బెంగళూరు జాతీయ రహదారిపై చేపట్టిన బ్రిడ్జి నిర్మాణంతో ట్రాఫిక్ జాం ఏర్పడి గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారని కౌన్సిలర్ లావణ్యశ్రీనివాస్‌గౌడ్ ఎంపీ కొండా విశ్వేశ్వరరెడ్డికి సోమవారం వినతిపత్రం ఇచ్చారు. ట్రాఫిక్ జాం సమస్యను నివారించాలని ఆమె కోరారు. దీంతో ఎంపీ తొండిపల్లిలో బ్రిడ్జి నిర్మిస్తున్న ప్రాంతాన్ని పరిశీలించారు. బ్రిడ్జి నిర్మాణం చివరి దశలో ఉండటం, బ్రిడ్జి దిగే చోట ర్యాంప్ పనులు చేస్తుండడంతో తొండిపల్లి టోల్‌ప్లాజా నుంచి రోడ్డుకు ఇరువైపులా ట్రాఫిక్ జాంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయాన్ని ఎంపీ గమనించి ట్రాఫిక్ జాం కాకుండా తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో పరమేష్‌గౌడ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని కాపాడండి

తాండూరు, ఆగస్టు 26: హైదరాబాద్ రోడ్డు మార్గంలోని లారీ పార్కింగ్ ఎదురుగా ఉన్న సర్వే నంబర్ 130లో 36 గుంటల ప్రభుత్వ స్థలాన్ని కొందరు వ్యక్తులు కబ్జా చేసే ప్రయత్నం చేస్తున్నారని ఆ భూమిని కాపాడాలని మాజీ కౌన్సిలర్ సూరజ్ సింగ్ ఠాకూర్ కోరారు. ఆయన సోమవారం కలెక్టర్‌కు, ఇతర ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. అక్రమ లేవుట్‌లు సృష్టించి ప్లాట్లకు నంబర్లు వేసి రిజిస్ట్రేషన్ చేశారని తెలిపారు. దీనిపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

షాద్‌నగర్‌కూ హైడ్రా

సీఎంకు విజ్ఞప్తి చేశానన్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్, ఆగస్టు 26: హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ మానిటరింగ్ అండ్ ప్రొటెక్షన్ ఏజెన్సీ(హైడ్రా)ను షాద్‌నగర్ నియోజకవర్గ పరిధిలో విస్తరించేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. దీనికి సంబంధించి సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లానని చెప్పారు. సోమవారం తన క్యాంప్ కార్యాలయంలో మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా హైడ్రా నిర్ణయాలు సంచలనం సృష్టిస్తున్నాయని, అక్రమ నిర్మాణాలు చేపట్టిన బడా బాబులు, సినీ నటులు, సెలబ్రెటీస్ గుండెల్లో రైళ్లు పరుగెత్తుతున్నాయన్నారు. షాద్‌నగర్ నియోజకవర్గంలోనూ చెరువు, కుంటలను ఆక్రమించి వెంచర్లు, విల్లాలు నిర్మించారన్నారు. వాటిని తొలగించేందుకు నియోజకవర్గం వరకు హైడ్రాను విస్తరింపజేయాలని సీఎంను కోరారని చెప్పారు. గతంలో వికారాబాద్ నుంచి వచ్చే ఫిరంగి కాలువను కూడా ధ్వంసం చేసి నిర్మాణాలు చేపట్టి నీటి సమస్యను సృష్టించారని వెల్లడించారు. ఫరూఖ్‌నగర్ మండలం బొబ్బిలి చెరువునూ ఆక్రమించారని తెలిపారు. రియల్ ఎస్టేట్ వ్యాపారుల ధనదాహంతో చెరువులు, కుంటలను నాశనం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే ప్రభుత్వ భూముల్లో వెంచర్లు వెలిశాయన్నారు. వీటి కట్టడికి హైడ్రాను షాద్‌నగర్ నియోజకవర్గానికి వర్తింపజేయాలని సీఎంను కోరారని ఎమ్మెల్యే వెల్లడించారు.

అర్హులందరికీ రుణమాఫీ వర్తింపజేయాలి

షాద్‌నగర్ అర్బన్: అర్హత కల్గిన ప్రతీ రైతుకు రుణమాఫీ వచ్చేలా చర్యలు తీసుకోవాలని వ్యవసాయాధికారులను ఎమ్మెల్యే శంకర్ ఆదేశించారు. క్యాంప్ కార్యాలయంలో వ్యవసాయాధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఏడీఏ రాజరత్నం, ఏవోలు పాల్గొన్నారు. ఇప్పటి వరకు రుణమాఫీ పొందని రైతుల వివరాలు అడిగారు. రుణం తీసుకున్న రైతుల జాబితాను బ్యాంకర్లు ఇవ్వలేదని, రుణమాఫీ వచ్చిన రైతుల జాబితా మాత్రమే ఉందని తెలిపారు. రుణమాఫీ రాని రైతుల కోసం ప్రభుత్వం యాప్ ఇచ్చిందని, మంగళవారం నుంచి రైతుల వద్దకు వెళ్లి, వివరాలు సేకరించి, అప్‌లోడ్ చేస్తామని ఏడీఏ రాజారత్నం తెలిపారు. మంగళవారం బ్యాంకర్లు, వ్యవసాయశాఖ అధికారులతో సమావేశాన్ని నిర్వహిస్తామనిన్నారు. అర్హతున్న ప్రతీ రైతుకు రుణమాఫీ వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు.

రాష్ట్రాభివృద్ధికి సాహసోపేత నిర్ణయాలు



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

కడ్తాల్, ఆగస్టు 26: ప్రజల మేలు కోసం కాంగ్రెస్ ప్రభుత్వం సాహసోపేత నిర్ణయాలు తీసుకుంటోందని కల్వకుర్తి ఎమ్మెల్యే నారాయణరెడ్డి అన్నారు. కడ్తాల మండలంలో సోమవారం ఆయన పర్యటించి అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కడ్తాలలోని పోచమ్మ ఆలయంలో పూజలు నిర్వహించారు. వంపుగూడలో అనారోగ్యంతో మృతిచెందిన భీమయ్య మృతదేహానికి నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి రూ.5వేలిచ్చారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అన్ని ప్రాంతాలు, సామాజిక వర్గాలకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ఆలయాల అభివృద్ధికి, కులవృత్తుల వారి రక్షణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. మండలాన్ని నగర శివారు ప్రాంతాలకు సమాంతరంగా అభివృద్ధి చేసేలా సీఎం రేవంత్‌రెడ్డి చొరవ తీసుకుంటున్నట్లు చెప్పారు. అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తామన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా, మండల నాయకులు బిక్యానాయక్, నర్సింహ, గూడూరు భాస్కర్‌రెడ్డి, హన్మనాయక్, యాదగిరిరెడ్డి, జహంగీర్ అలీ, జహంగీర్‌బాబ, మాజీ జడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్ రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ చేగూరి వెంకటేశ్, మాజీ సర్పంచ్ వేణుగోపాల్, మాజీ ఎంపీటీసీ లక్ష్మయ్య, నాయకులు శేఖర్‌గౌడ్, బిక్షపతి, నరేశ్ నాయక్, పోతుగంటి అశోక్, ఇమ్రాన్ బాబా, నాయకులు, ఉత్సవ కమిటీ సభ్యులు సత్యం యాదవ్, రాములు, మల్లేశ్ గౌడ్,కార్తీక్, రాంచందర్ నాయక్, యాదయ్య గౌడ్, రాములు, జంగారెడ్డి, యాదయ్య, బుచ్చయ్య, శ్రీను, కృష్ణ, పాండు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏసీపీ రాములు



వాలీబాల్ పోటీల్లో పాల్గొన్న యువకులు

యువత చెడు అలవాట్లను వదలాలి

పేట్‌బషీరాబాద్ ఏసీపీ రాములు

శామీర్‌పేట, ఆగస్టు 26: యువత చెడు అలవాట్లను వదిలివేయాలని ఏసీపీ రాములు పిలుపునిచ్చారు. మండలంలోని మజీద్‌పూర్‌లోని జైన్ హెరిటేజ్ ఇంటర్నేషనల్ పాఠశాల క్యాంపస్‌లో సోమవారం కమ్యూనిటీ పోలీసింగ్ శామీర్‌పేట పోలీసు స్టేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాలీబాల్ టోర్నమెంట్ క్రీడాపోటీలను ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌తో కలిసి ఏసీపీ రాములు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. విద్యార్థుల్లో క్రీడల్లో అత్యున్నత స్థాయికి ఎదగాలని సూచించారు. మాదకద్రవ్యాల జోలికి వెళ్లకుండా గొప్ప ఆశయంతో ముందుకెళ్లాలన్నారు. సమాజంలో ఆదర్శంగా నిలువాలని ఆయన హితవు చెప్పారు. శామీర్‌పేట ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్ మాట్లాడుతూ చెడుఅలవాట్లకు వెళ్లి డ్రగ్స్‌కు బానిసైతే జీవితాలు నాశనమవుతాయన్నారు. యువత నిత్యం క్రీడల్లో శిక్షణ పొందితే భవిష్యత్‌లో జాతీయ, అంతర్జాతీయ క్రీడాపోటీల్లో రికార్డులను సృష్టించగలుగుతారని యువతకు గొప్ప సందేశమిచ్చారు.

విజేతలకు ప్రోత్సాహక బహుమతులు

ఈ వాలీబాల్ క్రీడాపోటీల్లో ఉమ్మడి శామీర్‌పేట మండలం, తూంకుంట మున్సిపల్ పరిధిలోని యువత 18టీంలుగా వాలీబాల్ క్రీడాపోటీల్లో పాల్గొని ఎంతో ఉత్సాహంగా ఆడారు. మొదటి బహుమతి శామీర్‌పేట పోలీస్‌స్టేషన్ టీమ్ గెలుపొందింది. ద్వితీయ బహుమతి జగ్గంగూడ టీమ్, తృతీయ బహుమతి తూంకుంట టీమ్ గెలుపొందాయి. ఈ వాలీబాల్ క్రీడాపోటీల్లో గెలుపొందిన ప్రథమ, ద్వితీయ, తృతీయ టీమ్‌లకు సాయంత్రం ఏసీపీ రాములు ప్రోత్సాహక బహుమతుల కప్‌లను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐలు హారిక, మునీందర్, దశరథ్, నాయక్, మేడ్చల్ ఏబ్లాక్ కాంగ్రెస్‌అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, తూంకుంట మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, శామీర్‌పేట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వైఎస్‌గౌడ్, మాజీ జడ్పీటీసీ బాలేష్, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

మరమ్మతులు చేయకుండానే జీపీఆర్ఎస్ అమలా?



ట్రాక్టర్‌కు జీపీఆర్ఎస్ అమరుస్తున్న కాంట్రాక్ట్ సిబ్బంది

తాండూరు, ఆగస్టు 26: తాండూరు మున్సిపాలిటీలో డీజిల్ అక్రమాలకు చెక్ పెట్టేందుకు జీపీఆర్ఎస్ అమలుకు సిద్ధం చేశారు. మున్సిపల్ కొత్త కార్యాలయంలో మున్సిపల్ ఇన్‌చార్జి సానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య ఆధ్వర్యంలో సోమవారం ఆటోలు, ట్రాక్టర్లకు జీపీఆర్ఎస్ అమలు ప్రక్రియను చేపట్టారు. దాదాపు 18 ఆటోలు, 12 ట్రాక్టర్లు జీపీఆర్ఎస్ అమర్చారు. గతంలో తాండూరు మున్సిపాలిటీలో ఈ సిస్టం అమలు చేసినప్పటికీ సక్రమంగా అమలు కావడంలేదు. ప్రస్తుతం ఈనెల 3న జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో జీపీఆర్ఎస్ అమలు చేసేందుకు నిధులు కేటాయిస్తూ కౌన్సిల్ తీర్మానించింది. తాండూరు మున్సిపాలిటీలో సగానికి పైగా ఆటోలు, ట్రాక్టర్లు మరమ్మతులకు గురయ్యాయి. ఆటోలు, ట్రాక్టర్లు, సాంకేతిక కారణాలతో మరమ్మతులు ఉన్నప్పటికీ నెట్టుకొస్తున్నారు. ట్రాక్టర్లకు ఆటోలకు ఆయిల్ పోయించడం లేదని, టైర్లకు ట్యూబ్‌లకు ఇప్పించడం లేదని, చిన్న చిన్న మరమ్మతులు చేయడంలేదని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో కండిషన్ లేని వాహనాలతో జీపీఆర్ఎస్‌ను ఎలా కొనసాగిస్తామని శానిటేషన్ సిబ్బంది ప్రశ్నిస్తున్నారు. కౌన్సిల్ ఆమోదించిన నిధులను ఖర్చుచేసినట్లు చూపించుకోవడానికి అధికారులు తూతూమంత్రంగా చేయించి లెక్కలు రాసుకోవడానికి తప్ప ప్రయోజనం ఏమీ ఉండదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ సిస్టమ్‌తో డీజిల్ వృథాను అరికట్టగలుగుతారో లేదో వేచిచూడాల్సిందే.



బాలుర విభాగంలో రన్నర్‌గా నిలిచిన వికారాబాద్ జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న దృశ్యం



ఫైనల్‌లో బాలుర విభాగంలో తలపడుతున్న హైదరాబాద్, వికారాబాద్ జట్లు

బాస్కెట్ బాల్ చాంపియన్ మేడ్చల్

- రన్నర్‌గా నిలిచిన వికారాబాద్
- మూడో స్థానంలో నిలిచిన రంగారెడ్డి, మేడ్చల్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, ఆగస్టు 26: జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఐదో రాష్ట్రస్థాయి అండర్-16 బాల, బాలికల బాస్కెట్ బాల్ టోర్నీ ముగిసింది. సోమవారం మహబూబ్‌నగర్ స్టేడియంలో బాలుర విభాగంతో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో హైదరాబాద్ జట్టు 57-53తో వికారాబాద్‌పై గెలిచి విజేతగా నిలువగా, బాలికల విభాగం ఫైనల్ మ్యాచ్‌లో మేడ్చల్ జట్టు 58-56తో వికారాబాద్ గెలిచి చాంపియన్‌గా నిలిచింది. రన్నర్‌గా బాల, బాలికల విభాగంలో వికారాబాద్ జట్టు నిలువగా, మూడో స్థానంలో బాలికల విభాగంలో రంగారెడ్డి, బాలుర విభాగంలో మేడ్చల్ జట్లు నిలిచాయి.

క్రీడల్లో గెలుపు ఓటములు సహజం

క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమని, క్రీడాస్ఫూర్తిని చాటాలని మహబూబ్‌నగర్ మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ అన్నారు. బాస్కెట్‌బాల్ పోటీల విజేతలకు డీఎస్పీ వెంకటేశ్వర్లుతో కలిసి బహుమతులు ప్రదానం చేసి మాట్లాడారు. రాష్ట్రస్థాయి టోర్నీ జిల్లా కేంద్రంలో నిర్వహించడం సంతోషకరం అన్నారు. చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని, క్రీడాకారులకు బంగారు భవిష్యత్ ఉంటుందన్నారు. బాస్కెట్‌బాల్ సంఘం జిల్లా అధ్యక్షుడు మక్సూద్‌బిన్ అహ్మద్‌జాకీర్ మాట్లాడుతూ టోర్నీలో క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని వసతులు కల్పించామని, టోర్నీ విజయవంతం చేసేందుకు అసోసియేషన్ సభ్యులు ఎంతో కృషిచేశారన్నారు. కార్యక్రమంలో న్యాయవాది మనోహర్‌రెడ్డి, వన్‌టౌన్ సీఐ అప్పయ్య, రాష్ట్ర బాస్కెట్‌బాల్ సంఘం నుంచి నర్మన్‌ఇసాక్, జిల్లా బాస్కెట్‌బాల్ సంఘం కార్యదర్శి ననూరుల్లా పీఈటీలు తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదుపై దృష్టి సారించండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ రఘునందన్‌రావు

మొయినాబాద్ రూరల్, ఆగస్టు 26: అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో పనిచేసినట్టే పార్టీ సభ్యత్వ నమోదులోనూ నాయకులు పనిచేయాలని మెదక్ ఎంపీ, పార్టీ సభ్యత్వ నమోదు జిల్లా ఇన్‌చార్జి రఘునందన్‌రావు అన్నారు. సోమవారం అజీజ్‌నగర్‌లోని ఓ గార్డెన్‌లో పార్టీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి అధ్యక్షతన సభ్యత్వ నమోదుపై జిల్లాస్థాయి సమావేశంలో ఎంపీ పాల్గొని దిశానిర్దేశం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల లోపే సభ్యత్వాలపై దృష్టిపెట్టాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆలయ భూముల రక్షణకు హైడ్రా స్థాయి కమిటీని వేయాలని డిమాండ్ చేశారు. అక్రమ కట్టడాల విషయంలో ముఖ్యమంత్రి, రెవెన్యూ మంత్రుల వద్ద సమాచారం ఉందని, సీఎస్ స్థాయి అధికారులతో అక్రమ కట్టడాలపై వివరాలు వెల్లడిస్తే ప్రజలే చూసుకుంటారన్నారు. వెంటనే పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలన్నారు. రంగారెడ్డి జిల్లాలో 6లక్షల సభ్యత్వ నమోదులు చేయించాలని అధిష్ఠానం టార్గెట్ ఇచ్చిందన్నారు. సెప్టెంబరు 4వ తేదీ నుంచి సభ్యత్వ నమోదు ప్రారంభమవుతుందన్నారు. కార్యక్రమంలో చేవెళ్ల ఎంపీ కె.విశ్వేశ్వర్‌రెడ్డి, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి, అంజన్‌కుమార్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే రత్నం, జిల్లా సభ్యత్వ నమోదు కమిటీ ఇన్‌చార్జి మధుసూదన్ గుప్తా, చేవెళ్ల కన్వీనర్ మల్లారెడ్డి, జిల్లా, మండలాల నాయకులు పాల్గొన్నారు.

హరితహారం మొక్కలపై గొడ్డలి వేటు



మైతాబ్‌ఖాన్ గూడ గ్రామ రోడ్డులో నరికేసిన చెట్లు

నవాబుపేట, ఆగస్టు 26: పచ్చదనమే ప్రగతికి మెట్టు అనే లక్ష్యంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో హరితహారంలో నాటిన మొక్కలు ఏపుగా పెరిగి నీడనిస్తున్నాయి. నవాబుపేట మండలంలోని మైతాబ్‌ఖాన్‌గూడ, ఎల్లకొండ గ్రామాల రోడ్డుకు ఇరువైపులా పెరిగిన చెట్లను విద్యుత్ శాఖ అధికారులు తీగలకు అడ్డుగా ఉన్నాయి. అయితే, చెట్ల కొమ్మలు అడ్డొస్తే కొమ్మలు నరకాలి.. కానీ చెట్లను నరికివేయడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దాదాపు కిలో మీటర్‌కు పైగా చెట్లను మొత్తం నరకడంతో గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుకిరువైపులా నీడనిచ్చే చెట్లను నరకడమేంటని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు రంగారెడ్డి ప్రశ్నించారు. సంబంధిత అటవీశాఖ అధికా రులు స్పందించి చెట్లను నరికేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరారు. ఈ విషయంపై విద్యుత్ శాఖ లైన్‌మన్‌ను వివరణ కోరగా విద్యుత్ ఏఈ సూచన మేరకు చెట్లను నరికివేసినట్లు సమాధానమివ్వడం గమనార్హం.



తాండూరు: బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ప్రసంగిస్తున్న బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు శృతి

అధిక సభ్యత్వాలు చేసిన వారికి తగిన గుర్తింపు

బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శృతి

తాండూరు, ఆగస్టు 26: అత్యధిక సభ్యత్వ నమోదు చేసిన వారికి బీజేపీలో తగిన గుర్తింపు దక్కుతుందని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు శృతి అన్నారు. తాండూరులో సోమవారం బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. జిల్లా స్థాయి పార్టీ పదవులు లభించాలంటే సమావేశంలో కనీసం 200 సభ్యత్వ నమోదు చేసి ఉండాలని అన్నారు. సెప్టెంబర్ 8 నుంచి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని శ్రీకారం చూడుతున్నామన్నారు. నవంబర్ 10వరకు సభ్యత్వ నమోదు కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఆరేళ్లకు ఒకసారి సభ్యత్వ నమోదు ఉంటుందని తెలిపారు. స్థానిక సంస్థలు ఎన్నికల్లో పోటీచేసే వారికి కూడా సభ్యత్వ నమోదును పరిగణలోకి తీసుకుంటామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎంపీ ఎన్నికల్లో 70లక్షల పైచిలుకు ఓట్లు లభించాలన్నారు. సభ్యత్వ ఫీజు చెల్లింపు కేవలం ఆన్‌లైన్ ద్వారానే స్వీకరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, మాజీ అధ్యక్షుడు సదానందరెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు యు.రమేష్, సీనియర్ నాయకులు ఎం.నరేష్ మహరాజ్, శివరాజ్, సుదర్శన్ గౌడ్, బంటారం భద్రేశ్వర్ పాల్గొన్నారు.

నవాబుపేట: చేవెళ్ల పార్లమెంట్ పరిధిలో సోమవారం బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టినట్లు పార్టీ నవాబుపేట మండల ఇన్‌చార్జి రామకృష్ణారెడ్డి, దళిత మోర్చా అధ్యక్షుడు గాలయ్య, నియోజకవర్గ కన్వీనర్ రమేష్, మండల ఉపాధ్యక్షుడు చంద్రకాంత్, నాయకులు గోపాల్‌రెడ్డి తెలిపారు. మెదక్, చేవెళ్ల ఎంపీలు రఘునందన్‌రావు, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, తల్లోజు ఆచారి పార్టీ కార్యకర్తలతో మాట్లాడారు. ప్రతీ కార్యకర్త సభ్యత్వ నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. నియోజకవర్గంలో బీజేపీ బలోపేతానికి కార్యకర్తలు కలిసికట్టుగా పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బొంరాస్‌పేట్‌లో పల్లె పలకరింపు

బొంరాస్‌పేట్: బొంరాస్‌పేట్ మండల పల్లె పలకరింపు కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు. మండల కేంద్రంలో పార్టీ కార్యకర్తల సమన్వయం, గ్రామాల వారీగా మౌలిక సదుపాయాల గురించి చర్చించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు నాగురావు, బాబయ్యనాయుడు, శ్రావణ్‌గౌడ్, మల్లేశం, జగదీశ్వర్, శ్రీనివాస్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఊరూరా ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు


కేశంపేట: చిన్ని కృష్ణుడు, రాధిక వేషధారణల్లో చిన్నారులు

కృష్ణాష్టమి వేడుకలను సోమవారం ఊరూవాడల్లో ఘనంగా జరుపుకున్నారు. ఉదయాన్నే ఆలయాల్లో పూజలు నిర్వహించారు. చిన్నారులను రాధాకృష్ణుల వేషధారణల్లో అలంకరించి ఊరేగింపు తీశారు. ఇళ్లలోనూ పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. గ్రామాలు, పట్టణాల్లో ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు.


షాద్‌నగర్ అర్బన్: శ్రీకృష్ణ-గోపిక వేషధారణ పోటీలో పాల్గొన్న చిన్నారులు


కొత్తూర్‌లో శ్రీకృష్ణుని శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు


ఇబ్రహీంపట్నం: చప్పన్ భోగ్ వంటకాలతో కృష్ణాష్టమి వేడుక


కొందుర్గు: శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో గోకులాష్టమి వేడుకలు


శంకర్‌పల్లిలో శ్రీకృష్ణుడి వేషధారణలో చిన్నారులు


షాబాద్: నాగర్‌గూడ శ్రీకృష్ణ ఆలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు


చేవెళ్లలో..


కందుకూరులో చిన్నారుల వేషధారణ

కనుల పండువగా బోనాలు


యాచారం: అయ్యవారిగూడలో శ్రీ సోమనాథుని బోనాలను ఊరేగిస్తున్న భక్తులు

యాచారం/కేశంపేట/షాబాద్/కడ్తాల్/కందుకూరు/కొందుర్గు, ఆగస్టు 26: యాచారం మండలం మంతన్‌గౌరెల్లి, అయ్యవారిగూడల్లో సోమవారం శ్రీ సోమనాథుడికి బోనాలు సమర్పించారు. ఆలయంలో పూజలు నిర్వహించారు. బోనం ఎత్తుకున్న మహిళలు అగ్నిగుండాలు తొక్కుతూ బోనం సమర్పించారు. కేశంపేట మండలం కాకునూర్‌లో కురువ సంఘం ఆధ్వర్యం బీరప్ప, మహంకాళి బోనాలను నిర్వహించారు. మహిళలు బోనాలతో ఆలయాలకు చేరుకున్నారు. కొండారెడ్డిపల్లి, లింగంధనలోనూ మైసమ్మ, పోచమ్మ బోనాలు నిర్వహించారు. కార్యక్రమాల్లో ఆనంద్‌కుమార్, బాలీశ్వర్, మల్లేష్‌గౌడ్, శివ, నూరం శ్రీనివాస్, మధుసూదన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు. షాబాద్ మండలం ముద్దెంగూడలో పోచమ్మ, చందన్‌వెల్లిలో మల్లన్న బోనాలు కనులపండువగా నిర్వహించారు. పోచమ్మ, మల్లన్న స్వామికి నైవేద్యం సమర్పించారు. కడ్తాల్ మండలం రావిచెడ్‌లో పోచమ్మ బోనాలు జరుపుకున్నారు. ఎంపీటీసీల సంఘం జిల్లా మాజీ కార్యదర్శి గోపాల్ ఆధ్వర్యంలో వేడుకకు ఏర్పాట్లు చేశారు. ఊరేగింపులో పోతురాజుల విన్యాసాలు, మహిళల పూనకాలు ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో నాయకులు రంగయ్య, బాలకృష్ణ, బీరప్ప, జితేందర్‌రెడ్డి, శ్రీశైలం, నర్సింహారెడ్డి, లవ్ కుమార్, సురేందర్‌రెడ్డి, జంగయ్య, రవి, రమేశ్, సాయికుమార్ పాల్గొన్నారు. కందుకూరు మండలం జైత్వారం, హర్షగూడ, బాచుపల్లి, నేదునూరు, మన్నెగూడ గ్రామాల్లో జరిగిన పెద్దమ్మతల్లి బోనాలను నిర్వహించారు. ప్రజలకు కొత్తరకం వైరస్‌లు సోకకుండా చల్లగా చూడాలని తాను అమ్మ వారిని వేడుకున్నట్లు మహేశ్వరం కాంగ్రెస్ ఇన్‌చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. ఆయన అమ్మవారికి పూజలు చేశారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు ఉన్నారు. కొందుర్గులో షేరీలమైసమ్మ బోనాలు నిర్వహించారు. ఉదయం నుంచే గ్రామస్థులు ఆలయానికి చేరుకొని నైవేద్యం సమర్పించారు. సాయంత్రం 6గంటల నుంచి బోనాలతో ఊరేగింపుగా వెళ్లి ఆలయాల చుట్టూ ప్రదిక్షణ చేసి నైవేద్యం సమర్పించారు. ఆటోలు, ఎడ్ల బండ్లను ఆలయం చుట్టూ తిప్పారు. వర్షంలోనూ బోనాలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ రాజేష్ పటేల్, యాదయ్య, కృష్ణయ్యగౌడ్, కృష్ణయ్య, నరేందర్, వెంకటేష్, లింగం, మల్లేష్, సత్యనారాయణ పాల్గొన్నారు.


రావిచెడ్ బోనాల ఊరేగింపులో మహిళలు, నాయకుడు బొప్పిడి గోపాల్


షాబాద్: ముద్దెంగూడలో బోనాలతో తరలుతున్న మహిళలు


కందుకూరు: నేదునూర్ పెద్దమ్మతల్లి ఉత్సవాల్లో కేఎల్లార్‌కు సన్మానం


కొందుర్గులో షేరీల మైసమ్మ బోనాల ఉత్సవాలు

కొమరబండలో శివపార్వతుల కల్యాణం


శివపార్వతుల కల్యాణోత్సవంలో పాల్గొన్న గ్రామస్తులు

షాబాద్, ఆగస్టు 26: చివరి శ్రావణ సోమవారాన్ని పరస్కరించుకొని శివపార్వతుల కల్యాణాన్ని కనులపండువగా నిర్వహించారు. షాబాద్ మండలం కొమరబండలో బుగ్గరామేశ్వరస్వామి ఆలయంలో శివపార్వతుల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఈవో శ్రీనివాసులు తెచ్చిన తలంబ్రాలను స్వామి వారలకు పోయించారు. స్వామి వారి కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు తరలివచ్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు చంద్రశేఖర్, దేవేందర్‌రెడ్డి, గ్రామస్థులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు


పూజా కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు ◄

షాద్‌నగర్ అర్బన్, ఆగస్టు 26 : ఫరూఖ్‌నగర్ మండలం మధురాపురంలో దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు ప్రారంభమయ్యాయి. నవగ్రహాలు, నాగులు, శివలింగం, విఘ్నేశ్వరుడు, కుమారస్వామి, నందీశ్వరుడి విగ్రహాలను మల్కయ్యగారి గోవర్ధన్‌రెడ్డి, లక్కాపురం హరీశ్వర్‌రెడ్డి ప్రతిష్ఠించనున్నారు. సోమవారం యాగశాల ప్రవేశం, హోమాలు, విగ్రహాలకు అభిషేకాలను నిర్వహించి విగ్రహాల ఊరేగింపును కొనసాగించారు. కార్యక్రమాల్లో గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

కనకమామిడిలో సామూహిక కుంకుమార్చనలు


ఆలయంలో కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

మొయినాబాద్, ఆగస్టు 26: మండల పరిధి కనకమామిడిలోని సంఘమేశ్వరస్వామి ఆయలంలో శ్రావణ మాస సందర్భంగా సోమవారం స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో సామూహిక కుంకుమార్చన చేశారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అలాగే కనకమామిడి, కేతిరెడ్డిపల్లి వేంకటేశ్వరాలయంలో పూజలు చేశారు. చిన్నారుకు తులాభారం నిర్వహించారు. కేతిరెడ్డిపల్లిలో ఉట్లు కొట్టారు.

గోవింద నామస్మరణతో మార్మోగిన వేంకటేశ్వరాలయం


చేవెళ్లలో వేంకటేశ్వర స్వామి వ్లాఇ పల్లకిలో ఊరేగిస్తున్న భక్తులు ◄

చేవెళ్ల, ఆగస్టు 26: శ్రావణ సోమవారం సందర్భంగా చేవెళ్లలోని శ్రీ లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయం గోవింద నామస్మరణతో మార్మోగింది. ప్రతీ ఏటా మాదిరిగానే సంప్రదాయపద్ధతిలో గంపజాతర ఉత్సవాలు భక్తులు నిర్వహించారు. అయితే గంప జాతర సందర్భంగా చేవెళ్ల గ్రామస్తులు తమ కుటుంబ సభ్యులతో కలిసి దేవాలయంలోనే వంటలు చేసుకుని రోజంతా ఆలయంలోనే గడపారు. అనంతరం స్వామి వారికి మొక్కులు మొక్కున్నారు. ఈ ఆచారం తరతరాలుగా కొనసాగిస్తున్నారు. అయితే గంపజాతరను పురస్కరించుకొని ఆలయంలో ఉదయం నుంచి రాత్రి వరకు స్వామి ప్రత్యేక అలంకరణతో పాటు పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామి వారు గరుడ సేవపై ఊరేగుతూ భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆలయం గోవింద నామస్మరణతో మారు మోగింది. ఈ కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ ట్రస్టీ దేవుని వామనాచార్యులు, పూజారులు, దేవాదాయ శాఖ అధికారులు, సిబ్బంది, చేవెళ్ల మండల ప్రజాప్రతినిధులు, భక్తులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల పక్షాన నిలిచే నాయకులకు గుర్తింపు

కడ్తాల్, ఆగస్టు 26 : బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులైన యువజన సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఎర్రోళ్ల రాఘవేందర్‌కు సోమవారం అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ జడ్పీటీసీ దశరథ్‌నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో వివిద సంఘాల నేతలు, నాయకులు, యువకులు పాల్గొన్నారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పరమేశ్‌తో కలిసి రాఘవేందర్‌ను దశరథ్ సత్కరించారు. ప్రజాసమస్యల పరిష్కారానికి రాఘవేందర్ చేస్తున్న కృషిని కొనియాడారు. ప్రజల కోసం నిలిచే నాయకులకు గుర్తింపు ఉంటుందన్నారు. ప్రజాచైతన్య కార్యక్రమాల్లో యువత ముందుండాలని దశరథ్ కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సువాళిపంతూ, రమేశ్, లాయక్‌అలీ, నర్సింహ, రమేశ్, మహేశ్, రామకృష్ణ, అంజి, గోపాల్, రాజు పాల్గొన్నారు.


రాఘవేందర్‌ను సన్మానిస్తున్న మాజీ జడ్పీటీసీ దశరథ్‌నాయక్

అర్హులైన గీత కార్మికులకు లైసెన్స్‌లు ఇవ్వాలి


సీఐ బద్యనాథ్ చౌహాన్‌కు వినతి పత్రం అందజేస్తున్న సతీష్

ఆమనగల్లు, ఆగస్టు 26 : అర్హులైన గీత కార్మికులకు లైసెన్స్ మంజూరు చేయాలని కాంగ్రెస్ జిల్లా నాయకుడు ఎగిరిశెట్టి సత్యం ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం ఆమనగల్లు ఎక్సైజ్ కార్యాలయంలో గౌడ సంఘం నాయకులతో కలిసి సీఐ బద్యనాథ్‌చౌహాన్‌కు వినతి పత్రం ఇచ్చారు. శెట్టిపల్లిలో అనేక మంది గీత కార్మికులు తాటి చెట్లపై నుంచి పడి ప్రాణాలు, అవయవాలు కోల్పోయిన సందర్భాలున్నాయన్నారు. వారికి లైసెన్స్ లేక ప్రభుత్వం నుంచి ఎలాంటి ఎక్స్‌గ్రేషియా అందలేదని తెలిపారు. ట్యాప్ టెస్టింగ్ నిర్వహించిన గీత కార్మికులకు కూడా లైసెన్స్ రాలేదని పేర్కొన్నారు. తాటి చెట్లపై నుంచి పడి మృతిచెందిన, గాయపడ్డ గీత కార్మికులకు ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా ఇచ్చి ఆదుకోవాలని సత్యం కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో గౌడ సంఘం నాయకులు గౌని జయేందర్, రవి, కొప్పుల రాములుగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు రహదారిపై ట్యాపర్ల ఏర్పాటు

తలకొండపల్లి, ఆగస్టు 26 : మండల కేంద్రంలో వాహనాల వేగనియంత్రణ, రోడ్డు ప్రమాదాల నివారణకు ట్యాపర్లను ఏర్పాటు చేశారు. రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందిన మార్ల వేణు స్మారకార్థం ఆయన సోదరుడు మార్ల సుదర్శన్ ట్యాపర్లను తయారు చేయించారు. ప్రధాన రహదారిపై వాటిని ఏర్పాటు చేసి ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ రూల్స్‌పై ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పోలీస్ స్టేషన్ వద్ద రెండు, రహదారిపై రెండు చొప్పున ట్యాపర్లను ఏర్పాటు చేశారు. నాలుగు ట్యాపర్లను తయారు చేయించిన సుదర్శన్‌ను పోలీసులు, స్థానికులు అభినందించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ పద్మ నర్సింహ, మాజీ సర్పంచ్ లలితజ్యోతయ్య, ఏఎస్ఐలు విష్ణువర్ధన్‌రెడ్డి, సీతారామ్‌రెడ్డి, నాయకులు శేఖర్, దశరథం, పాండు, శ్రీశైలం, రమేశ్, రఘువర్, నితీష్ ఉన్నారు.

గణేష్ ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలి


షాద్‌నగర్ రూరల్: మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్

షాద్‌నగర్ రూరల్/తలకొండపల్లి/కొందుర్గు, ఆగస్టు 26 : గణేష్ ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలని షాద్‌నగర్ ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్ తెలిపారు. సోమవారం శాంతి సమావేశంలో మాట్లాడుతూ మండపాల వద్ద విధిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. విగ్రహాలను ప్రతిష్ఠించే ముందు విధిగా పోలీసుల అనుమతి తీసుకోవాలన్నారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా విగ్రహాలను ప్రతిష్ఠించుకోవాలని సూచించారు. మండపాల వద్ద మత్తు పదార్థాలు వినియోగించొద్దన్నారు. సమస్యాత్మక గ్రామాల్లో నిబంధనలకు లోబడి ఉండాలని అన్నారు. సమావేశంలో ఎస్సైలు బలరాం, సుశీల, రాంచచందర్, ఆయా గ్రామాల మాజీ సర్పంచ్‌లు పాల్గొన్నారు. తలకొండపల్లి సీఐ ప్రమోద్‌కుమార్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఏఎస్ఐ విష్ణువర్ధన్‌రెడ్డి అధ్యక్షతన గణేశ్ ఉత్సవ కమిటీలతో శాంతి సమావేశం నిర్వహించారు. నవరాత్రి ఉత్సవాల్లో అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. మండపాల ఏర్పాటుకు అనుసరించాల్సిన నిబంధనలపై కమిటీలకు వివరించారు. డీజేలకు అనుమతి లేదన్నారు. ఎక్కడ కూడా రోడ్లు బ్లాక్ చేయొద్దని, లౌడ్ స్పీకర్లు పెట్టకూడదని చెప్పారు. సమావేశంలో ఏఎస్ఐలు సీతారాంరెడ్డి, నర్సింహనాయక్, సిబ్బంది, నాయకులు, ఉత్సవ కమిటీ సభ్యులు జగదీశ్వర్, ఈశ్వర్, సజ్జుపాషా, శేఖర్, జ్యోతయ్య, నర్సింహ, కోటేశ్వర్, దశరథం, యాదయ్య, శ్రీశైలం పాల్గొన్నారు. కొందుర్గు ఎస్సై కృష్ణయ్య పోలీస్‌స్టేషన్‌లో గ్రామస్థులతో శాంతి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. సంస్కృతి, సంప్రదాయాల ప్రకారం పండుగలను జరుపుకోవాలన్నారు. వినాయక మండపాల ఏర్పాటుకు తమ నుంచి అనుమతులు తీసుకోవాలని సూచించారు. మాజీ వైస్‌ఎంపీపీ రాజేష్ పటేల్, మాణయ్య, నసీర్, శ్రీశైలం, షర్ఫొద్దీన్, చందు, లింగం, కిరణ్, మాసురి, యాదగిరి, మధు, సాయి, ఇబ్రాహీం, మహ్మద్, హసన్, వినోద్, గణేష్ పాల్గొన్నారు.


తలకొండపల్లిలో శాంతి సమావేశంలో మాట్లాడుతున్న సీఐ ప్రమోద్‌కుమార్


కొందుర్గులో శాంతి కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సై కృష్ణయ్య

ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడిగా నర్సింహయాదవ్


నియామక పత్రం అందుకుంటున్న నర్సింహయాదవ్

కేశంపేట, ఆగస్టు 26: బీజేపీ అనుబంధ ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడిగా కొత్తపేటకు చెందిన బీజేపీ సినియర్ నాయకుడు పసుల నర్సింహయాదవ్‌ను నియమించారు. సోమవారం ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ అజీజ్‌నగర్‌లో నియమాక పత్రాన్ని అందించారు. ఓబీసీల అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని, పదవి ఇచ్చినందుకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు నరసింహారెడ్డి, కిసాన్ మోర్చా జాతీయ ఉపాధ్యక్షుడు పాపయ్యగౌడ్, శ్రీవర్ధన్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామాలకు హైడ్రాను విస్తరించాలని, చెరువులను కాపాడాలని కోరారు.

ఆంజనేయులుకు అంబేడ్కర్ నేషనల్ అవార్డు


ఆహ్వానాన్ని అందుకుంటున్న ఆంజనేయులు

షాబాద్, ఆగస్టు 26 : డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ నేషనల్ అవార్డు 2024కు గాను మాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చొక్కంపేట అంజనేయులు ఎంపికైయ్యారు. అవార్డు సెలక్షన్ కమిటీ నేషనల్ చైర్మన్, బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్ల రాధాకృష్ణ సోమవారం నగరంలో ఆంజనేయులుకు ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. రాధాకృష్ణ మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సాహిత్యాన్ని ముందుకు తీసుకుపోవడానికి బహుజన సహిత్య అకాడమీ ఏటా ఉద్యమకారులకు, సంఘ సేవకులకు, రచయితలకు, కవులకు, స్వచ్ఛంద సంస్థలకు అవార్డులను ఇస్తోందని తెలిపారు. వచ్చే సెప్టెంబరు 5న తిరుపతిలో నిర్వహించే బహుజన రైటర్స్ 8వ సౌత్ ఇండియా కాన్ఫరెన్స్ సందర్భంగా అవార్డులను అందజేస్తామన్నారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు గౌతమ్, కోఆర్డినేటర్ విష్ణు తదితరులు ఉన్నారు.

పోచమ్మ ఆలయ నిర్మాణ పనులు ప్రారంభం

ఆమనగల్లు, ఆగస్టు 26: పోలెపల్లిలో పోచమ్మ ఆలయ నిర్మాణ పనులను సోమవారం ప్రారంభించారు. పురాతన ఆలయం స్థానంలో నూతన ఆలయ నిర్మాణానికి గ్రామానికి చెందిన కర్నాటి భగవాన్‌రెడ్డి కూతురు జిల్లెల్ల శరణ్య, పవన్‌కుమార్‌రెడ్డిలు ముందుకువచ్చారు. గ్రామస్థులతో కలిసి ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఆమనగల్లు మార్కెట్ మాజీ చైర్మన్ నారాయణ, పీఏసీఎస్ వైస్‌చైర్మన్ సత్యం, నాయకులు బాల్‌రామ్, సుక్కమ్మలాలయ్య, కుమార్, మాజీ ఉపసర్పంచ్ అంజన్‌రెడ్డి, కృష్ణారెడ్డి, బుచ్చిరెడ్డి, వెంకట్‌రెడ్డి, నారాయణ, గణేశ్‌యాదవ్, రవిప్రకాశ్, శ్రీశైలంగౌడ్, శేఖర్‌రెడ్డి, వెంకటయ్యగౌడ్, తిరుపతయ్యగౌడ్, వెంకట్‌నారాయణరెడ్డి, బాలకిష్టు, జంగయ్య, శ్రీశైలం, శంకరయ్య, యాదిరెడ్డి పాల్గొన్నారు.


ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న శరణ్యపవన్‌కుమార్‌రెడ్డి, నాయకులు

సంక్షిప్తంగా...

● **కొత్తూర్:** మున్సిపాలిటీలోని కుమ్మరిగూడకు వెళ్లే దారిలో ఉన్న రైల్వే క్రాసింగ్ ఈ నెల 27 నుంచి 29 వరకు మూసి వేస్తున్నట్లు రైల్వే శాఖ సీనియర్ ఇంజినీర్ సోమవారం పేర్కొన్నారు. రైల్వే క్రాసింగ్ వద్ద మరమ్మతుల కారణంగా రైల్వే గేటును మూసివేస్తున్నట్లు పేర్కొన్నారు. అంతరాయాన్ని ప్రజలు గమనించాలని కోరారు.

● **తలకొండపల్లి:** మెదక్‌పల్లి గ్రామానికి చెందని మశ్చేందర్ అనారోగ్యంతో మృతిచెందాడు. అతడి కుటుంబాన్ని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు డోకూరు ప్రభాకర్‌రెడ్డి పరామర్శించారు. బాధిత కుటుంబానికి రూ.3వేల సాయం అందజేశారు. అలాగే కసిరెడ్డి విజేందర్‌రెడ్డి రూ.2500 అందించారు. పరామర్శించిన వారిలో విష్ణుగౌడ్, విజేందర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, శివకుమార్, లాలయ్య, రవీందర్‌గౌడ్, లక్ష్మయ్య, శ్రీశైలం, ఖలీల్, సత్యనారాయణ గౌడ్, తదితరులు ఉన్నారు.

● **కందుకూరు:** కందుకూరుకు చెందిన ఆదిత్య శర్మ అనారోగ్యంతో సోమవారం మరణించాడు. అతడి పదోతరగతి స్నేహితులు కలిసి రూ.16.500 బాధిత కుటుంబానికి అందించారు. ఆంజనేయులు, శివలింగాచారి, మనోహర్, రమేష్, మల్లేష్ తదితరులున్నారు.

● **ఆమనగల్లు:** ఆమనగల్లుకు చెందిన ఎండీ రఫీ కుమారుడు రువాన్ ఆటిజంతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వెంకటేశ్ రువాన్‌ను పరామర్శించారు. చికిత్స నిమిత్తం తన ట్రస్ట్ ద్వారా రూ.10వేలు సమకూర్చగా తలకొండపల్లి మాజీ ఎంపీపీ నిర్మలశ్రీశైలం గౌడ్, సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు గోపాల్‌నాయక్ అందజేశారు. త్వరగా కోలుకోవాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ నాయకుడు రవూఫ్ ఉన్నారు.

● **షాద్‌నగర్:** రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బాధిత కుటుంబాన్ని ఆదుకుంటామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. షాద్‌నగర్‌కు చెందిన తల్లీకూతురు ఆదివారం కొత్తూరు మండలంలో రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రిలో ఉన్న వారి మృతదేహాలను ఎమ్మెల్యే సందర్శించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తాగిన మత్తులో డ్రైవింగ్ చేసి రెండు నిండు ప్రాణాలను బలిగొనడం బాధాకరమన్నారు. వారి కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామన్నారు. బాధిత కుటుంబాలకు తక్షణమే సాయం అందించాలని శంషాబాద్ ట్రాఫిక్ ఏసీపీ, కొత్తూరు సీఐలను ఆదేశించారు.

● **కందుకూరు:** ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, హైదరాబాద్ నగర మాజీ మేయర్ రచయిత, విద్యావేత్త ముదిరాజ్ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కొర్వి కృష్ణస్వామి పేరిట యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని మండల ముదిరాజ్ సంఘ నాయకులు డిమాండ్ చేశారు. కృష్ణస్వామి 131వ జయంతి సందర్భంగా మండల కేంద్రంలో పలువురు ముదిరాజ్ సంఘ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

కొత్తూర్, ఆగస్టు 26: మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డుపై సోమవారం స్కూటీని ఆర్టీసీ బస్సు ఢీకొన్న ప్రమాదంలో సుధాకర్ (32) అనే వ్యక్తి గాయపడ్డాడు. హైద్రాబాద్ నుంచి షాద్‌నగర్ వస్తున్న బస్సు. స్కూటీని ఢీకొనడంతో సుధాకర్ గాయపడ్డాడు. అతడిని స్థానికులు అంబులెన్స్‌లో షాద్‌నగర్‌కు తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

పాత నేరస్థులకు అధికారుల కౌన్సెలింగ్

శంషాబాద్, ఆగస్టు 26: శంషాబాద్ పరిధిలోని పాత నేరస్థులకు క్రైం డీసీపీ కొత్తపల్లి నర్సింహ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి ఏసీపీ శశాంక్ రెడ్డి ఆర్జీఐఏ పోలీస్ స్టేషన్‌లో కౌన్సెలింగ్ ఇచ్చారు. 25మంది పాత నేరస్థులను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి మాట్లాడారు. ఇకపై నేరాలు చేయకుండా అందరూ సాధారణ జీవితం గడపాలని అధికారులు వారికి సూచించారు.

